

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## తోడు - నీడ

"**అమ్మా. ఒక పెద్ద రిక్వెస్ట్.** నువ్వు నో చెప్పద్దు ప్లీజ్" మనస్విని తల్లి భుజాల చుట్టూ చేతులు వేసి అడిగింది.

"నువ్వు హామీ ఇవ్వకు అత్తా. ముందు విషయం చెప్పమను" శరత్ కంగారుగా చెప్పాడు.

"తమరు మాట్లాడకండి. ఎప్పుడో ముప్పై ఏళ్ళ క్రితం మా అమ్మ నీకు వేరు శనగపప్పు పెట్టి బెల్లమ్ముక్క ఇచ్చినందుకు ఇంత కృతజ్ఞతగా ఉండక్కర్లేదు" మనస్విని భర్తని కసిరింది.

యశోద కూతురి వంక నవ్వుతూ చూస్తూ అడిగింది.

"సరేకాని ఇంతకీ ఏ ఉపద్రవం తెచ్చావు మళ్ళీ?"

మనస్విని అర్థంలేని ఆదర్శాలతో ఇబ్బంది పెట్టడం, పడడం ఇంట్లోని ఆ ఇద్దరికీ అనుభవమే.

ఆ సాయంత్రం ముగ్గురూ ఇంటిముందున్న వరండాలో మెట్లమీద కూర్చున్నారు. యశోద జాజిపూలు మాలకడుతూంటే, శరత్ వాటిని రెండు రెండుగా వ్యతిరేక దిశలో పెట్టి, ఆమెకి సహాయం చేస్తున్నాడు. మనస్విని కప్పు నిండా కాఫీ తెచ్చుకుని రెండు చేతులతో పట్టుకుని కాఫీని ఆస్వాదిస్తూ తాగుతోంది. సగం తాగాక కప్పు కింద పెట్టి తల్లి భుజం చుట్టూ చేతులు వేసి మధ్య మధ్యలో గారాలు పోతోంది.

"అమ్మా. మా రాజేశ్వరి తెలుసుకదా నీకు?" మనస్విని ఉపోద్ఘాతంగా అడిగింది.

"నువ్వే చెప్పావుగా? విషయం ఏమిటి?" శరత్ అడిగాడు.

"నువ్వు మాట్లాడకుండా ఉంటావా?.. అమ్మ రాజేశ్వరికి మైసూర్‌లో టూ వీక్స్ ట్రైనింగ్ ఉంది."

"ఉంటే?" శరత్ కుతూహలంగా అడిగాడు.

"నువ్వెళ్ళి అబ్బిగాడు ఎక్కడున్నాడో చూడు. ఎంతసేపు ఆటలు? తలమీద మట్టిపోసుకుంటే నువ్వే వాడికి షాంపూ పోయాలి" మనస్విని భర్తని ఇంటి ఎదురుగా ఉన్న చిన్న పార్క్‌లోకి తరిమింది.

తర్వాత తల్లితో చెప్పింది.

"అమ్మా నీకు తెలుసుగా. రాజేశ్వరికి మదర్ లేదు. తన చిన్నప్పుడే విడాకులు తీసుకుని వెళ్ళిపోయింది. వాళ్ళ నాన్న ఒక్కడే తనకి పాపం."

ఈ ఉపోద్ఘాతం ఎక్కడకి దారి తీస్తుందా అని యశోద వేచి ఉంది.

"పేరెంట్స్ విడాకులు తీసుకోవడంతో తనకి పెళ్ళి మీద ఆసక్తి లేదు. వాళ్ళ నాన్న మంచివారే. వాళ్ళ నాన్నమ్మ గయ్యాళితనం భరించలేక వాళ్ళ అమ్మ వెళ్ళిపోయిందిట."

"ఇదంతా నాకెందుకు చెప్తున్నావు?"

"వాళ్ళ నాన్నకి బయటి ఫుడ్ పడదుట. తినరు అనికాదు కాని తింటే అసిడిటీతో బాధపడతారట. అందుకని..." మనస్విని ఆగిపోయింది.

"అందుకని? అత్తని ఆయనకి కేరియర్ పంపమంటావా?" కొడుకుని ఎత్తుకొచ్చిన శరత్ అడిగాడు.

"కేరియర్ కాదు. ఆయనే వచ్చి మనింట్లో ఉంటారు. ఈ ఫిఫ్టీన్ డేస్."

"కుదరదు. నేనొప్పుకోను" శరత్ కొడుకుని దించి చెప్పాడు.

"మనింట్లో నామాటే ఫైనల్. ఏమ్మా? పాపం ఆయన పెద్దమనిషి. ఒక్కడినే వదిలి పోవడానికి రాజేశ్వరి ఫీలవుతోంది."

"ఇంకొాళ్ళ ఇంటిలో ఉండటానికి ఒప్పుకుంటే ఆయన పెద్ద మనిషే కాదు. మనిద్దరం ఆఫీసులకి వెళ్ళిపోతే అత్త ఆయనకి సేవలు చేయాలి. నో" శరత్ జాజిపూలు విడదీస్తూ చెప్పాడు.

"అమ్మా!" మనస్విని అరిచింది.

"సరేలే రమ్మను. మనతోపాటే తింటారు. ఉంటారు" యశోద అంగీకారంగా చెప్పింది.

"అత్తని ఆయన ఎవరికో చాకిరి చేయమంటున్నావు. నాకు నచ్చలేదు విన్నీ" ఆ రాత్రి శరత్ చెప్పాడు.

"నా మాస్టర్ ప్లాన్ నీకు అర్థంకాలేదు. నువ్వంతే. చిన్నప్పటినించి శుద్ధ మొద్దువి" మనస్విని నవ్వింది.

"యంసెట్‌లో నీకన్నా ఒక్క మార్కేగా తక్కువ?" శరత్ ఉడుక్కున్నాడు.

"మరి రేంక్ ఎంత దూరం వెళ్ళింది?"

"అది సరేకాని. నీ మాస్టర్ ప్లాన్ ఏంటో చెప్పు" శరత్ మాట మార్చాడు.

"అమ్మ వంటరి కదా?"

"ఛ! వంటరేమిటి? మనం లేమా?"

"నీ తలకాయ్. నాన్న లేరుగా?"

"ఐతే? అనుమానంగా అడిగాడు.

"రాజీకి అమ్మలేదు. సో వీళ్ళిద్దరికీ పెళ్ళి చేద్దామని."

శరత్ మంచం మీంచి లేచి కూర్చున్నాడు.

అతని మొహం కోపంతో ఎర్రబడింది.

"నిజంగా నీకు బుద్ధిలేదు. అత్తతో అంటే తక్షణం ఇల్లు విడిచి వెళ్ళిపోతుంది. కంట్రోల్ చేసేవాళ్ళు లేక నువ్వు ఇష్టం వచ్చినట్లు చేస్తున్నావ్" తగ్గు స్వరంతో తీవ్రంగా చెప్పాడు.

"ఇందులో అంత తప్పేం ఉంది? కోపంతో నీ మొహం టొమేటాలా ఉంది తెలుసా?" మనస్విని నవ్వింది.

"విన్నీ ఇంకోసారి ఈ ప్రసక్తి తేవద్దు. అత్త మామయ్యని ఎంత ప్రేమించిందో నాకు తెలుసు" శరత్ ఆవేశం తగ్గలేదు.

"అమ్మ రిలాక్స్ అవుతున్న వయసిది. అరవై రెండేళ్ళయినా నా అక్కలా కనిపిస్తుంది. రాజేశ్వరి వాళ్ళ నాన్నకి అరవై ఐదు. సో. ఇద్దరూ కొత్త జీవితం స్టార్ట్ చేస్తారని. వంటరితనం కష్టం కదా?"

"మళ్ళీ వంటరితనం అంటే చంపేస్తా. మనం లేమూ? నువ్వు, నేను, అభయ్. మనమే అత్త జీవితం. తను ఇంకో జీవితం కావాలని నీకు చెప్పిందా?"

"అలా చెప్పలేదుగా? చూద్దాం. ఎంతమందిమి ఉన్నా భర్తకి ఉండే స్థానం భర్తదే. అమ్మకి ఏమీ చెప్పను. వాళ్ళ రెస్పాన్స్ చూసి అప్పుడు ఆలోచిద్దాం. పడుకో. నేను అమ్మ గురించి ఆలోచిస్తున్నా. నువ్వు స్వార్థపరుడివి. నీ గురించే ఆలోచిస్తావు" మనస్విని అనునయంగా చెప్పింది.

రాజేశ్వరితోపాటు చిన్న సూట్‌కేసుతో లోపలికి వచ్చిన ఆయన్ని చూసి మనస్విని ఆప్యాయంగా పలకరించింది.

"రండి అంకుల్. రాజీ వచ్చేదాకా ఇది మీ ఇల్లే అనుకోండి. ఫీల్ ఫ్రీ." తన కుటుంబ సభ్యులని పరిచయం చేసింది.

"మా అమ్మ యశోద. ఇతను శరత్ మహాశయుడు. వీడు అభయ్..... సారథి అంకుల్. రాజేశ్వరి వాళ్ళ నాన్నగారు."

ఆయన ముఖం ప్లజంట్‌గా లేకపోవడం ముగ్గురూ గమనించారు. ఇలా పరాయివాళ్ళ ఇంట్లో ఉండటం ఆయనకి ఇష్టంలేదని వాళ్ళకి అర్థమైంది.

"ఆంటీ నాన్నని ఒక్కర్నే వదిలి వెళ్ళాలంటే చాలా భయపడ్డాను. లక్కీగా మను 'మా ఇంట్లో ఉంటార్లే' అంది. నిశ్చింతగా వెళ్తున్నాను. థాంక్స్ ఆంటీ." రాజేశ్వరి కృతజ్ఞతగా చెప్పింది.

యశోద నవ్వింది తప్ప ఏం మాట్లాడలేదు. ఆవిడకి ఈ ఏర్పాటు నచ్చలేదు. కూతురికోసం తప్పక ఒప్పుకుంది.

వరండాలో తలుపు ఉన్న గదిలోకి వాళ్ళని తీసుకెళ్ళి మనస్విని చెప్పింది.

"ఇది మీ గది. ఈ గదిలోకి ఇంట్లోంచి, వరండాలోంచి రెండు తలుపులు ఉన్నాయి. మీకు ప్రైవసీ ఉంటుందని. దీన్ని శరత్ స్టడీ రూముగా వాడుకునేవాడు. దీనికి అటాచ్డ్ బాత్‌రూం కూడా ఉంది."

"ఈ రోజుల్లో ఇండిపెండెంట్ ఇళ్ళు తక్కువ" సారధి చెప్పాడు.

"స్థలం మా తాతయ్య కొన్నాడు. నాన్న ఇల్లు కట్టించారు. ఈ పక్క ఇంట్లో శరత్ మేనమామ ఉండేవారు. చిన్నప్పటినించి శరత్ మా ఇంట్లోనే ఉండేవాడు. అలా అల్లుడైపోయాడు" మనస్విని నవ్వింది.

కొద్దిసేపు ఉండి, తండ్రికి జాగ్రత్తలు చెప్పి రాజేశ్వరి వెళ్ళిపోయింది.

మర్నాడు పొద్దున హడావిడిగా వంట చేస్తున్న యశోద అతిథి లేచాడేమో అని రెండు మూడుసార్లు చూసింది. గది తలుపు మూసేవుంది. ఉల్లిపాయలు సన్నగా తరుగుతున్న శరత్ అది గమనించి చెప్పాడు.

"రిటైరయ్యారుగా లేట్‌గా లేస్తారేమో అత్తా."

"ఆయన పొద్దున్నే కాఫీ తాగుతారో, టీ తాగుతారో అడగలేదు. లేచాక ఒకసారి ఆయన అలవాట్లు తెలుసుకుంటే, ఇంక మనం ఆ ప్రకారం చేయచ్చు" యశోద చెప్పింది.

తొమ్మిదిన్నరకి సారధి తలుపు తీసుకుని హాల్లోకి వచ్చాడు. మనవడికి ఇడ్లీ పెడుతున్న యశోద మర్యాదగా లేచి చెప్పింది.

"కూర్చోండి. కాఫీ తాగుతారా? టీనా?"

"కాఫీనే. వేడిగా ఉండాలి" సారధి సోఫాలో కూర్చుని న్యూస్ పేపర్ అందుకున్నాడు.

యశోద కాఫీ కప్పు తెచ్చి టీపాయ్ మీద ఉంచింది. ఓ గుక్క కాఫీ తాగి ముఖం వికారంగా పెట్టి కప్పుని యధాస్థానంలో ఉంచి చెప్పాడు.

"నాకు తీపి అంటే వికారం. డయాబెటిస్ లేకపోయినా చక్కెర వేసుకోను."

యశోద ఆ కప్పు తీసుకెళ్ళి కాఫీ పారబోసి చక్కెర లేకుండా కాఫీ కలిపి తీసుకెళ్ళింది.

"బ్రేక్‌ఫాస్ట్ ఎప్పుడు తింటారు?" అడిగింది.

"ఆలస్యంగా నిద్రలేస్తాగా. ఒకేసారి భోజనం చేస్తా. పదకొండున్నర – పన్నెండు మధ్యలో" సారధి కాఫీ తాగుతూ చెప్పాడు.

"మీరు ఏ కూరగాయలు తినరో చెపితే అవి వండను."

"అన్నీ తింటాను కాని పులుసుల్లో, కూరల్లో బెల్లం వేస్తే తినను. అల్లం, వెల్లుల్లి విడిగా వేస్తే తింటాకాని కలిపి వేస్తే తినను. ఆ వాసన పడదు. ఊరగాయలు తినను. పప్పుల్లో చింతపండు వేస్తే ఇష్టం ఉండదు.."

సారధి చెప్పేది వింటుంటే తను మళ్ళీ వంట మొదలుపెట్టాలని యశోదకి అర్ధమైంది.

"అన్నం బిరుసుగా ఉంటే నచ్చదు. మెత్తగా ఉంటే తినను. మెతుకు అంటుకోకూడదు. పొద్దునవి రాత్రికి తినను."

యశోద మనవడి ముందు బొమ్మలు పడేసి వంట గదివైపు వెళ్ళింది.

"టి.వి పెడతారా 'మునిమాపువేళ' సీరియల్ వస్తుంది పదింటికి" సారధి కోరాడు.

టి.వి ఆన్ చేసి రిమోట్ ఆయన చేతికిచ్చింది.

టి.విలో డైలాగ్స్ వింటూ వంట చేసింది. సారధి ఒక పదినిమిషాలు లోపలికి వెళ్ళి స్నానం చేసి వచ్చాడు.

"భోజనం వడ్డించనా?" పదకొండున్నరకి యశోద అడిగింది.

"వడ్డించక్కర్లేదు. టేబుల్ మీద పెట్టండి. నేను వడ్డించుకుని తింటా" చెప్పాడు.

ఆ ప్రకారం యశోద అభయ్‌కి అన్నం పెడుతూ వరండాలో కూర్చుంది. సారధి కంచంలో అన్నీ వడ్డించుకుని టి.వి ముందు కూర్చుని చూస్తూ తిన్నాడు. తర్వాత అన్నిటిమీద మూతలు పెట్టి కంచం సింక్‌లో పెట్టి చేతులు కడుక్కుని మంచినీళ్ళు తాగి మళ్ళీ టి.వి ముందు కూర్చున్నాడు.

యశోద మనవడ్ని నిద్రపుచ్చి గదిలో పడుకోపెట్టి వచ్చి భోజనానికి కూర్చుంది.

సారధి నాలుగ్గంటలదాకా టి.వి చూసి, ఓసారి ఆవులించి, టి.వి ఆపేసి గదిలోకి వెళ్ళి తలుపు మూసుకున్నాడు.

ఐదున్నరకి యశోద పిల్లవాడ్ని ఆడిస్తూ వరండాలో కూర్చుంది. సారధి వరండా వైపున్న తలుపు తెరిచి కొద్దిగా చిరాగ్గా చెప్పాడు.

"కొంచెం నెమ్మదిగా మాట్లాడతారా? నిద్రపోతున్నా."

యశోదకి అవమానంగా అనిపించింది. ఆవిడ స్వేచ్ఛగా మనవడితో ఆడుతూ పాడుతూంటుంది.

వాడిని ఎత్తుకుని పెరట్లోకి వెళ్ళి మొక్కలకి నీళ్ళు పోసి బెండకాయలు, టొమేటోలు కోసి బుట్టలో వేసుకుని లోపలకి వచ్చింది. సారధి సోఫాలో కూర్చుని టి.వి చూస్తున్నాడు.

"కాఫీ ఇవ్వనా?" అడిగింది.

తలూపాడు.

ఇంట్లో ఉన్న స్నాక్స్ ఓ ప్లేట్లో పెట్టి ఇచ్చి, తర్వాత కాఫీ ఇచ్చింది.

ఆరున్నరకి శరత్ వచ్చాడు. డ్రెస్ మార్చుకుని ప్లేట్లో కారప్పూస తెచ్చుకుని కరకర నములుతూ యశోదకి ఆ రోజు ఆఫీస్‌లో జరిగిన విశేషాలు చెప్పటం మొదలు పెట్టాడు.

రెండు నిమిషాల తర్వాత సారధి అతనివైపు తిరిగి చెప్పాడు.

"ప్లీజ్. మీరు కూడా వంటగదిలోకి వెళ్ళి కబుర్లు చెప్పవచ్చుగా? ఆ కరకర శబ్దాలు నాకు ఎలర్జీ."

శరత్ బిత్తరపోయాడు. మౌనంగా ప్లేట్ తీసుకుని వంటగదిలోకి వెళ్ళాడు. యశోద అతన్ని చూసి నవ్వింది. కాఫీ గ్లాసు అందిస్తూ చెప్పింది.

"పద.. పూలు కోసుకుందాం."

ఇద్దరూ పెరట్లోంచి ముందు వైపుకి వచ్చారు. ఏడుగంటలకి మనస్విని వచ్చింది. సారధి పక్కన కూర్చుని కబుర్లు చెప్పాలని ఉబలాటపడిందికాని ఆయన ఆసక్తి చూపించలేదు. ఆయన మనసంతా టి.వి సీరియల్స్ మీదే ఉంది.

వంటగదిలోకి వెళ్ళి తల్లిని అడిగింది.

"ఎలా గడిచింది ఈ రోజు? వంట చేస్తున్నావేంటీ? రెండుపూటలకీ కలిపి పొద్దున్నే చేసేస్తావుగా?"

"ఆయన పొద్దుటివి రాత్రికి తినడట. రోజు బానే గడిచింది కాని ఆ టి.వి సౌండ్ కొంచెం తగ్గిస్తే బాగుండేది. ఇల్లంతా హోరెత్తిపోతోంది."

"అయ్యో! మనస్విని విచారపడింది" ఆయన టి.వి ముందు కూర్చుని వాళ్ళ అలవాటుకి విరుద్ధంగా మౌనంగా రాత్రి భోజనం చేసారు.

శుక్రవారం దాకా అలాగే గడిచిపోయింది. శనివారం పొద్దున మనస్విని ఆయన్ని అడిగింది.

"అంకుల్. మా కాలనీలో వెంకటేశ్వరస్వామి టెంపుల్ ఉంది. వెళ్దామా?"

"నాకు గుళ్ళంటే చిరాకు. ఏదైనా రెస్టరెంట్‌కి లంచ్‌కి వెళ్దాం. ఫ్రైడ్ రైస్ తినాలని వుంది" ఆయన చెప్పాడు.

"డిన్నర్‌కి వెళ్దాం అంకుల్. అమ్మ ఆల్‌రెడీ వంట స్టార్ట్ చేసేసింది. అదీకాక శరత్‌కి సాటర్‌డే సెలవు ఉండదు" మనస్విని చెప్పింది.

"డిన్నర్‌కి రాను. సీరియల్స్ పోతాయి" సారధి చెప్పాడు.

యశోద కూతుర్ని లోపలికి పిలిచి చెప్పింది.

"మీ ఇద్దరూ వెళ్ళండి. నన్ను పిలవద్దు. ఈ టి.విగోల లేకుండా అభయ్‌తో హాయిగా ఉంటా ఈ రెండు గంటలు."

మనస్విని నిస్సహాయంగా చూసింది.

లంచ్ చేసి వచ్చాక సారధి గదిలోకి వెళ్ళి తలుపు మూసుకున్నాడు. మనస్విని ఏదో చెప్పబోతుంటే యశోద గొంతు తగ్గించి చెప్పింది.

"ష్! ఆయనకి నిద్రపోయేప్పుడు చప్పుడు చేస్తే చిరాకు."

మనస్విని మౌనంగా ఫోన్‌లో మునిగిపోతే యశోద నవల చదువుకుంటూ గడిపింది.

ఆదివారం మళ్ళీ అంతా డిన్నర్‌కి వెళ్ళివచ్చారు.

"చాలా థాంక్స్ మనూ. మా నాన్నని చూసుకున్నావు" రాజేశ్వరి చెప్పింది మనస్విని నవ్వి ఊరుకుంది.

"మన ప్లాన్ ఏమైనా వర్కవుట్ అయ్యేలా ఉందా? ఈ రెండు వారాలు నేనెంతో ఆశపెట్టుకున్నాను. నాన్నని పెళ్ళి చేసుకుని ఆంటీ మా ఇంటికి వచ్చేస్తే నాకెంతో నిశ్చింత" రాజేశ్వరి ఆశావహంగా చెప్పింది.

మనస్విని మాట్లాడలేదు. అమ్మ ఇంట్లోంచి వెళ్ళిపోవడం అన్నది ఆమెకి నచ్చలేదు. అంతదాకా ఆయనే తమ ఇంటికి వచ్చి తమతో ఉంటాడని మనస్విని అనుకుంది.

ఆ సాయంత్రం ఆమెతో ఇంటికి వచ్చిన రాజేశ్వరి తండ్రిని తీసుకుని వెళ్ళిపోయింది.

వాళ్ళ కారు కదలగానే శరత్ కొడుకుని గాల్లోకి ఎగరేస్తూ హుషారుగా 'యాహూ' అని అరిచాడు. యశోద టి.వి స్విచ్చాఫ్ చేసి చెప్పింది.

"అబ్బ! ఏం మనిషి విన్నీ.. ఆయన? ఆ టి.వి పిచ్చేమిటి? మగాళ్ళు టి.వి సీరియల్స్ చూస్తారని నాకు తెలీదు. ఎంత కోపమో. కూర నచ్చకపోతే ఎంత కోపంగా చూస్తాడో. ఇల్లు పిన్‌డ్రాప్ సైలెంట్‌గా ఉండాలి అంటాడు. పిల్లాడు ఉన్నప్పుడు ఎలా కుదురుతుంది? కూతురు ఆఫీస్‌కి వెళ్తే ఇంట్లో ఒక్కడే ఉంటాడు కాబట్టి అలా అలవాటు పడిపోయాడు. నీకు ముందే చెప్తున్నా. ఇంక ఎవర్నీ ఇంటికి తీసుకురావద్దు."

"అసలు అందుకే వాళ్ళావిడ విడాకులు ఇచ్చి వుంటుంది. కరకర నమిలితే చిరాకుట. అభయ్ అరిస్తే ఎంత కోపమో. జైల్లో ఉన్నట్లు ఉన్నా. నోరార మాట్లాడి ఎన్ని రోజులైందో. కలిసి భోజనంకూడా చేయడు" శరత్ అన్నాడు.

మనస్వినికి కూడా ఆయన వెళ్ళాక ఇల్లు ప్రశాంతంగా ఉందనిపించింది.

"ఏం ఫేమిలీ అది? అత్తా అల్లుళ్ళు ఒకటే కబుర్లు, ఇకయికలు, పకపకలు" సారథి జుగుప్సగా చెప్పాడు.

"నాన్నా శరత్ పేరెంట్స్ అతని చిన్నప్పుడే పోతే మేనమామ తెచ్చి పెంచారట. వాళ్ళు అతన్ని సరిగ్గా చూడకపోతే యశోదగారు, వాళ్ళాయన అతనికి భోజనం పెట్టి చదువు చెప్పించారుట. తర్వాత మనుకి ఇచ్చి పెళ్ళి కూడా చేసారు. అత్తా అన్నా శరత్‌కి ఆవిడ అమ్మ కంటే ఎక్కువ." రాజేశ్వరి వివరించే ప్రయత్నం చేసింది.

"ఐనా కూడా నాకు నచ్చలేదమ్మ. ఇంక నువ్వెప్పుడు కేంప్ కి వెళ్ళినా నేను ఇంట్లోనే ఉంటాను . ఆ పిల్లాడో పిశాచం పిల్లాడు. అరుపులు, కేకలు. టివిలో మాటలు వినిపించలేదంటే నమ్ము. ఆ పిల్ల ఒకటే మంచిదిలా ఉంది. ఈ అమ్మమ్మ

మనవడు రోజంతా ఒకటే గోల. ఆవిడ ఎంత పెద్దగా నవ్వుతుందో తెలుసా? నవ్వే ఆడదాన్ని నమ్మకూడదు..." సారధి దారిపొడవునా విమర్శిస్తూనే ఉన్నాడు.

ఆ రాత్రి మనస్విని, రాజేశ్వరి వాట్సప్ అకౌంట్స్‌కి ఒకరినించి ఒకరికి ఒకేసారి ఒకే మెసేజ్ వచ్చింది.

'సారీ'

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments